క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ

చివ్వెంల : అనాథలకు ప్రతి ఒక్కరూ చేయూత నందించాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులో ఉన్న ఆలేటి ఆటం అనాథాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, ఎస్‌ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

అర్వపల్లి : పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు కూడా వెంటనే పదోన్నతులు కల్పించాలని పీఆర్‌టీయూ మండల కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం అర్వపల్లిలో పీఆర్‌టీయూ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సీహెచ్. ధర్మయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. యల్లయ్య, వి. సైదులు, చంద్రారెడ్డి, పురుషోత్తం, మధూకర్, వైవి.రావు, మల్లారెడ్డి, నాగరాజు, రాము, మురళికృష్ణ, లక్ష్మయ్య, సాయిలు, సురేందర్, భవాని, కవిత పాల్గొన్నారు.

కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా సాయికుమార్



నాగారంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎన్నికలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నాగారం : కాంగ్రెస్ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా మండల కేంద్రానికి చెందిన కొలిపాక సాయికుమార్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యయాదవ్ అతడికి నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్మకంటి సోమయ్య, ఈదుల రమేష్‌చంద్ర, వెంకట్‌రెడ్డి, పంది శ్రీనివాస్, బండగొర్ల కుమారస్వామి, ఆకుల శ్రీనివాస్, చంద్రయ్య, మంగదుడ్ల దశరథ, షేక్.జానీ, ఎస్‌కే.వలీ, సలీం, హుస్సేన్, చాంద్ పాష, షావలీ, రవి, నరేష్, వీరన్న రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ పోరాటాల ఫలితమే వేతనాల పెంపు

పెన్‌పహాడ్ : సీఐటీయూ ఎన్నో పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల కు ఇచ్చే కనీస వేతనం రూ. 1000 నుంచి రూ. 3వేలకు పెంచిందని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు వెంకటమ్మ, ఎస్‌కే. అమ్మని, సాయమ్మ, ఎల్లమ్మ, సునీత, ధనమ్మ, మానస, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ కమిటీ ఎన్నిక



ఇరుగు నరేష్



కలంచర్ల శ్రీను

ఆత్మకూర్ (ఎస్) : ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) మండల కమిటీ అధ్యక్షులుగా మండల పరిధిలోని ఇస్తాళాపురం గ్రామానికి చెందిన ఇరుగు నరేష్ ఎన్నికయ్యారు. మండల పరిధిలోని బొప్పారంలో నిర్వహించిన పీవైఎల్ మండల మహాసభలో ఈ కమిటీని ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులుగా పోతురాజు ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా కలంచర్ల శ్రీను, సహాయ కార్యదర్శిగా దడిగెల లింగయ్య, కోశాధికారిగా దామెర శ్రీను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం మండల అధ్యక్షుడు ఇరుగు నరేష్ మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు.

అర్వపల్లికి పరామర్శ

అర్వపల్లి : అంబేద్కర్ ఆర్ట్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు బందెల అర్వపల్లి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో అర్వపల్లిని సీతారాంపురం గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బైరబోయిన మహారాజు ఆదివారం పరామర్శించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన యువకులు నాతి ప్రశాంత్, బొడ్డు నవీన్‌లు శనివారం మొండ్రాయి సమీపంలోని గిర్నితండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య ఆదివారం మృతుల భౌతికకాయాలను సందర్శించి, మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎర్ర యాదగిరి, శేఖర్‌రెడ్డి, జంపాల రాజు, ఈదుల కిరణ్, మహేందర్, జాన్‌వెస్లీ, మాణిక్యం, వెంకటాచారి, శ్రీనివాస్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

హైవేలపై ఇసుక.. ప్రయాణికుల అవస్థ

- సూర్యాపేట-జనగామ, నకిరేకల్- తానంచర్ల హైవేలపై పేరుకుపోతున్న ఇసుక
- వాహనాలు జారిపడి గాయాలపాలవుతున్న ప్రయాణికులు
- ఇసుకను తొలగించాలని సంబంధిత అధికారులకు ప్రజల వినతి



అర్వపల్లిలో హైవేపై పేరుకుపోయిన ఇసుక



సీతారాంపురం వద్ద ఎస్సారెస్పీ వంతెనపై..

అర్వపల్లి : సూర్యాపేట-జనగామ, నకిరేకల్-తానంచర్ల రెండు జాతీయ రహదారులపై ఇసుక ఎక్కడికక్కడ పేరుకుపోయింది. సూర్యాపేట-జనగామ రహదారిపై అర్వపల్లి నుంచి తిమ్మాపురం వరకు, నకిరేకల్-తానంచర్ల హైవేపై జాజిరెడ్డిగూడెం నుంచి వెలుగుపల్లి వరకు రోడ్డుపై ఇసుక పేరుకుపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అర్వపల్లిలో మెయిన్‌రోడ్డు, తుంగతుర్తి రోడ్డు, జాజిరెడ్డిగూడెం రోడ్డు, సూర్యాపేట రోడ్డు నాలుగు వైపులా రోడ్డు వెంట ఇసుక పేరుకుపోయింది. ఈ ఇసుకతో ప్రధానంగా ఇళ్ల యజమానులు, దుకాణదారులు అవస్థలపాలవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు తరచూ జారిపడుతున్నారు. అయితే ఈ హైవేలపై పేరుకుపోయిన మట్టి, ఇసుకను గతంలో హైవేల కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు సంబంధిత యంత్రంతో శుభ్రం చేయించేవారు. కానీ ఏడాది నుంచి రోడ్లపై పేరుకుపోయిన మట్టి, ఇసుకను తొలగించడంలేదు. దీంతో ఇసుక రోడ్లపై కుప్పలు, కుప్పలుగా తయారవుతోంది. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి హైవేలపై పేరుకుపోయిన ఇసుక, మట్టిని తొలగించి శుభ్రం చేయించాలని వాహనచోదకులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పేరుకుపోయిన ఇసుకతో ప్రమాదాలు



నకిరేకల్-తానంచర్ల జాతీయ రహదారిపై అర్వపల్లి నుంచి సీతారాంపురం వరకు హైవేపై రెండు వైపులా ఇసుక పేరుకుపోయింది. గతంలో ఎప్పటికప్పుడు శుభ్రం చేయించేవారు. కానీ కొన్ని నెలలుగా శుభ్రం చేయక ప్రమాదాలు అవుతున్నాయి.

– బందెల వెంకన్న, సీతారాంపురం

చర్యలు తీసుకుంటాం



సూర్యాపేట-జనగామ, నకిరేకల్-తానంచర్ల రెండు హైవేలపై పేరుకుపోయిన ఇసుకను వెంటనే తొలగించి రోడ్లను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటాం. ఇసుక ట్రాక్టర్లు ఎక్కువగా తిరుగుతుండటంతో ట్రాక్టర్ల నుంచి ఇసుక కిందపడి తరచూ ఇబ్బంది అవుతుంది.

– ప్రవీణ్‌రెడ్డి, ఎన్‌హెచ్ డీఈఈ





జాతర సందర్భంగా దురాజ్‌పల్లి పెద్దగట్టు ఆలయానికి గంపలతో వెళ్తున్న భక్తులు



స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



మెటల్ డిటెక్టర్ గుండా గంపతో వెళ్తున్న భక్తులు

గౌడల ఆరాధ్య దైవం కంఠమహేశ్వర స్వామి

పెన్‌పహాడ్ : గౌడల ఆరాధ్య దైవం కంఠమహేశ్వర స్వామి అని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది కేఎల్‌ఎన్ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన కంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గౌడలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆరాధ్య దైవాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. పరమశివుడి స్వరూపమే కంఠమహేశ్వరుడని తెలిపారు. ప్రతి గ్రామంలో కూడా గౌడలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి కంఠమహేశ్వర స్వామి ఆలయం నిర్మించుకోవాలన్నారు. గీత కార్మికులకు కొత్త లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడి వెంకటేశ్వర్లు, బాలెబోయిన శ్రీనివాస్, బెల్లంకొండ శ్రీరాములు, నాగభూషణం, దొంతగాని గోపయ్య, పుట్ట సైదులు, బెల్లంకొండ డాంగ్యే, మామిడి పాపయ్య, వట్టికూటి నాగయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



తిరుమలగిరిలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కార్యకర్తలు

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. ఆదివారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో వెలుగుపల్లి గ్రామానికి చెందిన గుడిపాటి మహేందర్, గుడిపాటి ముత్తయ్య, చింతకుంట్ల లోకేష్, మురగుండ్ల అవిలయ్య, మల్లేపాక మల్లేషలతో పాటు మరో 50 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, గుండగాని రాములు, మట్టపల్లి శ్రీశైలం, కటకం వెంకటేశ్వర్లు, పరమేష్, రాములు, యాకోబు, రత్నాకర్, సురేష్, ప్రసాద్, జలేందర్, వీరయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ చెక్కుల పంపిణీ

కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. ఆదివారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో తుంగతుర్తి మండలానికి చెందిన బాధిత కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వాన్ని తీసుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. పార్టీ సభ్యత్వం పొంది ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా కింద రూ.2లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు.

యోగానందలక్ష్మీనర్సింహుడికి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకెళ్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే



ధ్వజస్తంభంపై ధ్వజపటం ఎగురవేస్తున్న అర్చకులు

అర్వపల్లి : స్థానిక యోగానందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించే కల్యాణోత్సవానికి జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేందర్‌రావు, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌లు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మెయిన్‌రోడ్డు నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా పట్టువస్త్రాలను, తలంబ్రాలను తీసుకెళ్లారు. ఆలయంలో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్‌లకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్‌ను జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, దేవస్థానం చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, సర్పంచ్ బి.సునీతారామలింగయ్యలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, చైర్మన్ సీహెచ్. విద్యాసాగర్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ దావుల మనీష, సర్పంచ్ బైరబోయిన సునీతారామలింగయ్య, ఎంపీటీసీ కనుకు పద్మశ్రీనివాస్, దేవాలయ ఈఓ వై. శ్రీనివాస్‌రెడ్డి, మొరిశెట్టి ఉపేందర్, బొడ్డు రామలింగయ్య, వల్లపు గంగయ్య, ఉపసర్పంచ్ ప్రభాకర్, దేవస్థాన డైరెక్టర్లు పులిచర్ల ప్రభు, కోటమర్తి మల్లయ్య, జూనియర్ అసిస్టెంట్ పి. శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, యోగానందదీక్షిత్, పవన్‌కుమార్, నాయకులు ఎం. రాజలింగం, కడారి నరేష్, దావుల లింగయ్య, కిరణ్, వెంకన్న, ఎల్లేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఆర్డీఆర్ తరపున..

అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తన ఇలవేల్పు దైవమైన స్వామికి కల్యాణోత్సవం సందర్భంగా రాష్ట్ర మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పట్టువస్త్రాలను పంపించగా వాటిని దేవస్థాన మాజీ చైర్మన్ బైరబోయిన సైదులు ఆదివారం ఆలయంలో అర్చకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి ధ్వజారోహణం, దేవతాహ్వానం కార్యక్రమాలను ఆచార్యులు ఘనంగా నిర్వహించారు. భగవానుడి వాహనమైన గరుడ ఆళ్వార్‌ను కొత్త వస్త్రంపై చిత్రించి పూజాధికములు నిర్వహించి, గరుడ ఆళ్వారుడికి ప్రత్యేక ఆరాధనలు చేశారు. వేద పారాయణీకులచే వేద పారాయణాలు, మూల మంత్ర, అనుష్టానంలు గావించారు. అనంతరం భేరిపూజ, దేవతాహ్వానం ప్రత్యేకంగా జరిపించారు. బ్రహ్మ సమక్షంలో జరిగే ఈ ఉత్సవాలకు ముల్లోకాలకు చెందిన దేవతలందరినీ ఆహ్వానించడం, వచ్చిన దేవతలకు ఇష్టమైన సంగీత ఆలాపనలతో సత్కరించి బస ఏర్పాట్లు చేసే పర్వాలను పూర్తి చేశారు. చివరిగా స్వామికి ఇష్టమైన పదార్థాలైన గరుడముద్దలను నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా గరుడముద్దలను ధ్వజస్తంభం వద్ద పైకి ఎగురవేసి పూజించారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, ఆలయ చైర్ చిల్లంచర్ల విద్యాసాగర్, సర్పంచ్ బైరబోయిన సునీతారామలింగయ్య, కనుకు శ్రీనివాస్, ఉపసర్పంచ్ ప్రభాకర్, ఈఓ వై. శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పి. శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అర్చకులు విఖనసలక్ష్మీనర్సింహచార్యులు, రాంబాబుఅయ్యంగార్, యోగానందదీక్షిత్, పవన్‌కుమార్, వేదపండితుడు మాధవాచార్యులు, నాయకులు కడారి నరేష్, ఎం. రాజలింగం, ప్రభు, వెంకన్న, పుల్లయ్య, ఎల్లేష్, ధర్మకర్తలు, అధికారులు, పారాయణీకులు, వేదపండితులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న బొమ్మిడి లక్ష్మీనారాయణ

భానుపురి : సూర్యాపేట పట్టణంలో వ్యాపారులకు, హమాలీలతో సమస్యలు ఏర్పడుతున్నాయని, ఆ సమస్యలను పరిష్కరించుకుని సమన్వయంతో పని చేసుకునేందుకు కమిటీని ఏర్పాటు చేసినట్లు కిరాణా ఫ్యాన్సీ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక కిరాణా ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ అధ్యక్షులు, గౌరవాధ్యక్షులతో పాటు మరికొందరు సభ్యులుగా ఉన్న ఈ కమిటీ ఆధ్వర్యంలో పలు విషయాలపై చర్చించి షరతులతో కూడిన ఒప్పందాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, వెంపటి రమేష్, వెంపటి రవితేజ, చల్ల విశ్వనాథం, ప్రతాపుని చక్రధర్, భాగ్యదయ అంకుర్, అల్లం రెడ్డి, బండారు శ్రీను, వీరమల్ల యాదగిరి, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

సూర్యాపేట : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాస రావు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట, పద్మశాలి యువజన విభాగం ఆధ్వర్యంలో అపోలో డయాగ్నస్టిక్ సెంటర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్షల శిబిరానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం షుగర్, కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెం చంద్రశేఖర్, పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి చలమల్ల నర్సింహ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్ చంద్ర, పద్మశాలి యువజన విభాగం అధ్యక్షుడు మిట్టకొల యుగేందర్, సంఘం ప్రచార కార్యదర్శి, కార్యక్రమ నిర్వాహకులు పున్నం వెంకన్న, కొంగరి ఉపేందర్, జగదీష్, అపోలో డయాగ్నస్టిక్ సెంటర్ సూర్యాపేట ఇన్‌చార్జ్ గంజి రాము, గంజి సంతోష్, మహేష్, రాచకొండ శ్రీనివాస్, సాలయ్య, భిక్షం, వెంకట్, సందీప్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగట్టులో ఎమ్మార్పీఎస్ నాయకుల పూజలు



స్వామి వారిని దర్శించుకుంటున్న నాయకులు

చివ్వెంల : మండల పరిధిలోని దురాజ్‌పల్లి శ్రీ లింగమంతుల స్వామి జాతరను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 13న ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో చేపట్టే విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి దిగ్బంధం విజయవంతం చేయాలని స్వామి వారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బొడ్డు విజయ్, నాయకులు మంద కుమార్, చిన్న శ్రీరాములు, యాతాకుల రాజయ్య, ములకలపల్లి రవి, కొమ్ము శేఖర్, బొడ్డు విజయ్, చెరుకుపల్లి కిరణ్, చెరుకుపల్లి సతీష్, మిర్యాల చిన్ని పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న రజనీరాజశేఖర్

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో రూ.35 లక్షలతో చేపట్టే సీసీ రోడ్లు, అండర్ డ్రైయినేజీ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని తెలిపారు. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనం, పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంపాల వెంకన్న, వీరన్న, వంగరి బ్రహ్మం, ఉమేష్, పరశురామ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ స్నేహలత

తిరుమలగిరి : తిరుమలగిరి మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ఆ సమస్యలు పరిష్కరించాలని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో తిరుమలగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు మాట్లాడారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు అవసరమున్నాయని, చాలా చోట్ల విద్యుత్ తీగలు క్రిందికి వేలాడుతుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. గతంలో ఈ సమస్యలు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వెలిశాల ఎంపీటీసీ పొన్నం సమత మాట్లాడారు. దళిత బంధు పథకంలో లబ్ధిదారులకు అన్యాయం జరిగిందని, దళిత బంధు పథకంపై విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత మాట్లాడారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. వేసవిలో నీటి సమస్య రాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమేష్‌చారి, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్

భానుపురి : సూర్యాపేట జిల్లాలో సోమవారం నుంచి నిర్వహించనున్న హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల నేతలతో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విచ్ఛిన్నకర శక్తుల నుంచి దేశాన్ని కాపాడటం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేశారని అన్నారు. భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా ఏఐసీసీ ఆదేశాల మేరకు రెండు నెలల పాటు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ భావజాలాన్ని ప్రచారం చేసి ఈ యాత్రలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. నియోజకవర్గ హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రను పట్టణంలోని 24 వార్డులో ప్రారంభించనునట్లు తెలిపారు. ఈ యాత్రకు గాను సూర్యాపేట నియోజకవర్గ కన్వీనర్‌గా దారావత్ వీరన్ననాయక్, తుంగతుర్తి నియోజకవర్గ కన్వీనర్‌గా గుడిపాటి నర్సయ్యను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్స్ కొప్పుల వేణారెడ్డి, గుడిపాటి నర్సయ్య, పీసీసీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్‌రావు, నాయకులు ఎండీ అంజాద్ అలీ, చెంచల శ్రీనివాస్, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, బైరు శైలేందర్‌గౌడ్, వేముల కొండ పద్మ సైదులు, కోతి గోపాల్‌రెడ్డి, దారావత్ వీరన్ననాయక్, దండి రమేష్, ముక్కాల అవిలమల్లు యాదవ్, కందాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దళిత బంధును సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారుడికి కార్ కీస్ అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజని

తిరుమలగిరి : దళిత బంధు పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనీరాజశేఖర్ కోరారు. ఆదివారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డుకు చెందిన లబ్ధిదారుడు పోతరాజు యాకన్నకు దళిత బంధు పథకం ద్వారా పొందిన స్విఫ్ట్ డిజైర్ కార్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల ఆర్థిక స్వావలంభన కోసం ఈ పథకం ప్రవేశ పెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

స్విఫ్ట్ కారులో మంటలు

చివ్వెంల : స్విఫ్ట్ కారులో ఒక్కసారిగా మంటలు వచ్చిన ఘటన దురాజ్‌పల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై కిందకు దిగాడు. పక్కనే ఉన్న పోలీసులు మంటలు ఆర్పారు.

కారు, ట్యాంకర్ ఢీ..

అతివేగంగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఈ ఘటన ఆదివారం దురాజ్‌పల్లి వద్ద విజయవాడ-హైదరాబాద్ రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారును వెనుకనుంచి వస్తున్న సిమెంట్ ట్యాంకర్ ఢీ కొట్టింది. దీంతో కారు వెనుకభాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఆలయ గర్భగుడికి గ్రిల్స్‌గేటు బహూకరణ

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయ గర్భగుడికి స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు దావుల వీరప్రసాద్‌యాదవ్-మాజీ ఎంపీపీ మనీష, దావుల సతీష్‌యాదవ్-ఉమా దంపతులు స్టెయిన్‌లెస్ స్టీల్ గ్రిల్స్ గేటును ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, సర్పంచ్ బైరబోయిన సునీతరామలింగయ్య, ఎంపీటీసీ కనుకు పద్మశ్రీనివాస్, ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, పులిచర్ల ప్రభు, కడారి నరేష్, మామిడాల రాజలింగం, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, యోగానంద్‌దీక్షిత్, పవన్‌కుమార్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నాగారం : సీఎం సహాయనిధిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య అన్నారు. గ్రామానికి చెందిన చర్లపల్లి మల్లమ్మ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆమెకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.16,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఫణిగిరి గ్రామంలో ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎర్ర యాదగిరి, ముదిరెడ్డి శేఖర్‌రెడ్డి, జంపాల రాజు, మంచినీళ్ల మహేందర్, ఈదుల కిరణ్, తీగుళ్ల యాదగిరి, పెరుమళ్ల జాన్‌వెస్లీ, మాణిక్యం, వెంకటాచారి, శ్రీనివాస్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య జాతర ప్రారంభం



చీదెళ్లలో శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్య స్వాముల విగ్రహాలను తీసుకెళ్తున్న భక్తులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో ఆదివారం శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్య స్వాముల జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా తంగెళ్లపల్లి పాండయ్యచారి ఇంట్లో నుంచి దేవతామూర్తుల విగ్రహాలను తీసుకెళ్లి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమి టీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, సర్పంచ్ పరెడ్డి సీతా రాంరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, గుర్రం అమృతారెడ్డి, దేశగాని రాజీవ్ గాంధీ, ఉప సర్పంచ్ బిజిగ గోపి, అంజయ్య, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ. 500కోట్లు కేటాయించాలి

నూతనకల్ : రాష్ట్ర బడ్జెట్‌లో గౌడ కులస్తులకు సమగ్ర అభివృద్ధి కోసం రూ. 500కోట్లు కేటాయించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సభ్యుడు బత్తుల జనార్దన్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. అధిక జనాభా కలిగిన గౌడలకు గౌడ బంధు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబ సభ్యులకు రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, పింఛన్లు రూ. 5వేలకు పెంచాలని కోరారు. ప్రతి మండల కేంద్రంలో నీరా ప్రాజెక్టు ఏర్పాటు చేసి గౌడ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని అన్నారు.